సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 26.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 214
పేజీలు: 08 వెల: రూ. 5

# మోదీ చాలా గ్రేట్..

**ఫోన్ కాల్‌తో లైవ్‌లోకి ట్రంప్..**

- ఏ అవసరం వచ్చినా అడగొచ్చు..
- భారత్ అతిశక్తి వంతమైన దేశమన్న ట్రంప్
- మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి
- మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం.. నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు.
- అమెరికాకు భారత్ నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్

02



భారత ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. భారత ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. మోదీ చాలా గ్రేట్.. ఆయనకు నేను పెద్ద అభిమానిని అంటూ ట్రంప్ పేర్కొన్నారు. -ముద్ర డెస్క్:



## హైదరాబాద్ మెట్రోకు
# భారీ ఊరట

*ఐఆర్ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ ఒప్పందం*

- మెట్రో విస్తరణకు ఆర్థిక బలం..
- 20 ఏళ్ల రుణ సదుపాయంతో కొత్త ఊపు
- ఎల్అండ్‌టీ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి హైదరాబాద్ మెట్రో యాజమాన్యం బదిలీ
- ట్రాఫిక్ సమస్యలకు చెక్..
- మెట్రో కనెక్టివిటీ పెంపుపై ప్రభుత్వం ఫోకస్
- సీఎం రేవంత్ నేతృత్వంలో పట్టణ రవాణా బలోపేతం..
- హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక వెసులుబాటు

**న్యూ ఢిల్లీ :**
హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. అధికారులు ఈ ఒప్పందాన్ని హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక మిగతా 02లో

# ప్రతి గింజ కొంటాం

**కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప పంటను కొనుగోలు చేయడం లేదు**

- హమాలీలు బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడింది
- ఎండల కారణంగా మధ్యాహ్నం పని జరగడం లేదు
- సీపీఎం బృందంతో సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని విమర్శించారు. సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్ ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఆ ప్రతినిధి బృందం సీఎం కు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సీఎం స్పందిస్తూ, రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందన్నారు. ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామన్న సీఎం.. మొక్కజొన్నను మద్దతు ధరకు మిగతా 02లో







## అనర్హుల రేషన్
# గుట్టురట్టు

*బోగస్ తెల్లరేషన్ కార్డులపై ఉక్కుపాదం*

- ఐటీ ఉద్యోగుల తెల్లకార్డులు బట్టబయలు
- అనర్హుల కార్డుల రద్దు వేగం
- ఆదాయం ఎక్కువైతే కార్డు రద్దే
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై సర్కార్ ఫోకస్
- డేటా విశ్లేషణలో బోగస్ గుట్టు
- అర్హుల కార్డులకు ప్రభుత్వం భరోసా
- తప్పుడు వివరాలతో కార్డులు రద్దు
- రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో నిరుపేదలకు అందాల్సిన తెల్లరేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లూ దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి కార్డుల ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. అయితే ఈ తనిఖీల్లో కీలక విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడంతో వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే మిగతా 02లో

## ఇందిరా మహిళా శక్తి కార్పొరేట్ సూపర్ బజార్లు

- త్వరలోనే లాజిస్టిక్ హబ్లు, గోదాములు, రైస్ మిల్లులు
- ఒకేరోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణం
- తెలంగాణ మహిళలను దేశానికి ఆదర్శంగా నిలుపుతాం
- సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేసిన సీఎం

02



## హర్మూజ్
# రీ ఓపెన్!

**ఓపెన్ చేసేందుకు ఇరాన్ అంగీకారం**

- చివరిదశలో అమెరికాతో చర్చలు
- మరో వారం రోజుల్లో సాఫీగా నౌకాయానం

04



## కాంగ్రెస్ వి దొంగ గ్యారెంటీలు

**ఒక్క ఇల్లు నిర్మించినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్
- మేం నిర్మించిన ఆస్పత్రులకే రిబ్బన్లు కట్ చేస్తున్నారు
- గుంపు మేస్త్రీకి కూల్చడమే తెలుసు..
- కేసీఆర్ కి కట్టడమే ఎరుక
- కూకట్‌పల్లి నేతల సమావేశంలో కేటీఆర్

02



## ప్లే ఆఫ్ హీట్..

**ఐపీఎల్ ట్రోఫీపై 4 జట్ల కన్ను**




- హైదరాబాద్ – గుజరాత్ – బెంగళూరు – రాజస్థాన్.. ఎవరి దమ్ము ఎంత?
- పాయింట్ల టేబుల్ ముగిసింది..
- ఇప్పుడు అసలైన సమరం ప్రారంభం
- రెండో టైటిల్ కోసం నాలుగు జట్ల భారీ పోరు
- ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్ రేసులో గెలుపు ఎవరి వైపు?

04

## శత్రువులు మన పార్టీలోనే ఉన్నారు



**పవన్ సంచలన వ్యాఖ్యలు**

- జగన్ జైలుకు వెళ్లాలని నేనేందుకు కోరుకుంటా
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలపై కౌంటర్
- అమిత్ షాతో భేటీపై పవన్ క్లారిటీ
- ఏపీ అభివృద్ధి కోసమే సమావేశం

02

## ఏపీలో సముద్ర తీరం
## అభివృద్ధికి విజన్ ప్లాన్

- తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు
- సముద్రతీర అభివృద్ధిపై నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం


03



# మళ్లీ పెరిగిన ధరలు


*10 రోజుల్లో నాలుగోసారి*

**ముద్ర డెస్క్ :**
దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. ప్రభుత్వ చమురు రంగ సంస్థలు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, లీటర్ డీజిల్‌పై రూ.2.71 పెంపు అమల్లోకి వచ్చింది. ఈ కొత్త ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. ఇది పది రోజుల వ్యవధిలో జరిగిన నాలుగో ధరల పెంపు కావడం గమనార్హం. వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా పెంపు మరింత భారాన్ని మోపనుంది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు దాదాపు రూ.8 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. మిగతా 02లో



- సామాన్యుడి జేబుకు మళ్లీ గండి
- లీటర్‌కు రూ.2కుపైగా పెంపు
- హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115 దాటింది.. డీజిల్ కూడా శతకం దాటేసింది
- అంతర్జాతీయ ముడి చమురు ప్రభావం
- రవాణా నుంచి నిత్యావసరాల వరకు ప్రభావం
- పెరుగుతున్న ఇంధన ధరలతో ఆందోళన

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 26.05.2026
www.mudranews.in | @mudranews



## జుట్టు ఆరోగ్యానికి కరివేపాకు



కరివేపాకులో ఉండే విటమిన్ బి మరియు యాంటీఆక్సిడెంట్లు జుట్టులోని మెలనిన్ పిగ్మెంట్‌ను రక్షించి జుట్టు నల్లగా ఉండేలా చేస్తాయి. వీటిని ప్రతిరోజూ కూరల్లో తినడం లేదా మజ్జిగలో కలిపి తీసుకోవడం వల్ల జుట్టుకు లోపల నుండి మంచి పోషణ లభిస్తుంది.

## ఇందిరా మహిళా శక్తి
# కార్పొరేట్ సూపర్ బజార్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలోని మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందన్న ఆయన రూ. 1,390 కోట్ల వడ్డీ లేని రుణాలు చెల్లించిందన్నారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సీఎం అన్నారు. సంఘాలే వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని, వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. డీమార్ట్, బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నా రు. పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలన్న సీఎం.., రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలన్నారు, మహిళా సంఘాలకు ఆదాయం రావా లి అన్నదే తమ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే మంచి పంటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరు కులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభి స్తే రైతులకు మేలు జరుగుతుందని, వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు, మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సం దర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థి కంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఒకే రోజు, ఒకే సమయంలో 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయం అన్నా రు. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే కేవలం సమావేశాల స్థలం ఇవ్వటం కాదని, వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను నిర్మించడమని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి మార్గమని భావించి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకంలో ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల వరకు చెల్లించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవసరం లేదని కొందరు రెచ్చగొట్టారని, ఈ పథకాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. మహిళల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, ఆ కుట్ర లను తిప్పికొట్టి ఉచిత ప్రయాణాన్ని కొనసాగించిందని అన్నారు. మహిళలను బస్సులను యజమానులుగా మార్చాలన్న ఆలోచనతో మహిళా సంఘాల ద్వారా 1000 బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ప్రణాళికను అమలు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సోలార్ ఎనర్జీ అనగానే అదానీ, అంబానీ వంటి పెద్ద సంస్థలే గుర్తుకు వచ్చే పరిస్థితి మారిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రిలయన్స్ వంటి సంస్థలు నిర్వహించే పెట్రోల్ బంకుల వ్యాపారంలోనూ సంఘాలను భాగస్వాములుగా చేస్తున్నామని సీఎం వెల్లడించారు. జిల్లా కేంద్రాల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరె న్స్‌లో పలు జిల్లాల సమాఖ్యలతో ముఖ్యమంత్రి



ముఖా ముఖి మాట్లాడారు. నారాయణపేట మహిళా సమాఖ్య సభ్యులు పెట్రోల్ బంక్ ద్వారా తాము ఇప్పటివరకు దా దాపు 27 లక్షల సంపాదించామంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. మహిళా సంఘాలు చేపడుతున్న కొన్ని వ్యా పారాల్లో నెలకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా బ్యాంకులకు వందకు వంద శాతం రీపేమెంట్ చేసిన నిర్మల్ జిల్లా సమాఖ్య పరిధిలోని సంఘాలను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మెయిన్ రోడ్డులో వారికి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే స్థలాన్ని కేటాయించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలు ప్రతి రూపాయిని నిజాయితీగా తిరిగి చెల్లిస్తూ ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. పెద్ద వ్యాపా రులు, పెద్ద సంస్థలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకుని ఎగ్గొట్టి పారిపోయిన ఉదాహరణలు ఉన్నాయని, కానీ ఇక్కడి మహిళా సంఘాలు ఆర్థిక క్రమశిక్షణలో వారికి గుణపాఠం నేర్పుతున్నాయని అ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు సారె లాగా ఇంది రమ్మ చీరలు అందజేస్తోందని సీఎం అన్నారు. గతంలో ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను తరిమేందుకు ఉపయోగించారనే విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామ ని, ఈసారి చిలుకపచ్చ రంగులో కొత్త డిజైన్ చీరలు ఇవ్వబోతున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎంఎల్ ఏలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యా ర్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, మహిళా శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వి దొంగ గ్యారెంటీలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించలేదని, ఒకవేళ నిర్మించినట్లు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. గతంలో తాము నిర్మించిన ఆస్పత్రులకే సీఎం రిబ్బన్లు కట్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూల్చివేతలే తప్పా నిర్మించడం తెలియదన్నారు. సోమవారం హైదరాబాద్ లోని కూకట్‌పల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ఓట్ల సవరణ కార్యక్రమంపై కేటీఆర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్ అనే దరిద్రాన్ని దూరం చేసుకున్నారన్న కేటీఆర్.. తెలంగాణలో మాత్రం ప్రజలు అధికారం ఇస్తే రెండేళ్లుగా ఆ దరిద్రం మన నెత్తిన కూర్చుందన్నారు పక్కన ఏపీలో కాంగ్రెస్ మొత్తం తుడిచిపెట్టుకుపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్ల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతోపాటు ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా ఉండాలని కోరారు. దీనికోసం ప్రతి బూత్ నుంచి తగిన ప్రణాళికతో ముందుకు పోవాలని కోరారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే.. హైదరాబాద్ నగరంలో 24 గంటల తాగునీటిని ప్రతి ఇంటికి సరఫరా చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోత, నీటి కోత తీవ్రంగా ఉండేదన్న ఆయన పట్టుదలతో 24 గంటల నిరంతర కరెంట్‌ను హైదరాబాద్ నగరానికి, రాష్ట్రానికి అందించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదేవిధంగా తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికి 24 గంటల సురక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు. దగ్గరుండి మరి హైదరాబాద్ నగరానికి 24 గంటల తాగునీటిని అందించేందుకు బాధ్యత నేను తీసుకుంటానన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రతి వర్గాన్ని మోసం చేసిందన్నారు. పెన్షన్ల నుంచి మొదలుకొని.. మహిళలకు రూ.



2,500 వరకు ప్రతి ఒక్క వర్గానికి.. హామీలు ఇచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. హైదరాబాద్ నగరానికి రెండున్నర సంవత్సరాల పరిపాలనలో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ నగరానికి ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా కాంగ్రెస్ తోనే దెబ్బ తిందనీ దీనితోని లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఉపాధి లభించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులతో పాటు సెంట్రింగ్ కార్మికుల కోసం బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కేటీఆర్ తెలిపారు. ఈసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డిజిటల్ రూపంలోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదుకు సంబంధించిన.. కార్యక్రమం, కమిటీల ఏర్పాటు దాదాపు 50 నుంచి 60 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి కూడా పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ పార్టీ తరపున ఇస్తామని తెలిపారు.

# అనర్హుల 'రేషన్' గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)
గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

**అర్హుల కార్డులకు భరోసా..!**
అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్లతో కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరికొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్స్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు, వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)
కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని, చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం తెలిపారు.
తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు, ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నాయకులను కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి. సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం. గోపాలరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రోకు
# భారీ ఊరట..

(మొదటి పేజీ తరువాయి)
ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగిస్తామన్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నట్లు వివరించారు. రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుందన్నారు. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుందని చెప్పారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్
# ధరలు

(మొదటి పేజీ తరువాయి)
తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.20కు పెరిగింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో పెట్రోల్ ధర లీటరుకు రూ.115.58కు చేరుకోగా, డీజిల్ ధర రూ.103.74కు పెరిగింది. అలాగే విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ ధర రూ.104.88కు చేరింది. ఇంధన ధరల పెరుగుదల వెనుక అంతర్జాతీయ పరిణామాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. చమురు సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశాలు ఉండటంతో గ్లోబల్ మార్కెట్‌లో ధరలు ఎగబాకుతున్నాయి.
అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ముడి చమురు ధరల ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని తెలుస్తోంది. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయనేదానిపై ఇంధన ధరల భవిష్యత్ ఆధారపడి ఉండనుంది. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే సామాన్య ప్రజలపై మరింత ఆర్థిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# మోదీ చాలా గ్రేట్

**ముద్ర డెస్క్ :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. భారత్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ చాలా గ్రేట్.. ఆయనకు తాను పెద్ద అభిమానిని.. అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఏది కావాలనుకుంటే.. దానిని సాధించి తీరుతుంది.. అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ఆకర్షిస్తున్నాయి.
అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఢిల్లీలో కలర్‌ఫుల్‌గా జరిగాయి. ఈ నేపథ్యంలో భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆ దేశ ఎంబసీ ఢిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ క్రమంలో భారత్‌లోని యూఎస్ రాయబారి సెర్జియో గోర్, అలాగే రుబియోతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లైవ్ ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రికార్డులు సృష్టిస్తోందన్నారు. రూబియో.. అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ కార్యదర్శిగా నిలుస్తారన్నారు ట్రంప్. ఇక, భారత్ అంటే ఎంతో ఇష్టమని.. ప్రధాని మోదీ గొప్ప నాయకుడు.. భారత్‌కు ఎప్పుడైనా సహాయం అవసరమైతే.. తనను వందశాతం నమ్మొచ్చన్నారు ట్రంప్. భారత్‌కు ఏ అవసరం వచ్చినా.. నేరుగా తనకు కాల్ చేయొచ్చన్నారు. ఇదిలాఉంటే.. అమెరికా, భారత్‌లు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు దగ్గరలోనే ఉన్నాయని.. ఇది త్వరలోనే జరుగుతుందని మార్కో రుబియో ఆదివారం వెల్లడించారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతకుముందు రుబియో.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జైశంకర్ తో భేటీ అయ్యారు.

# శత్రువులు మన పార్టీలోనే ఉన్నారు

**ముద్ర డెస్క్ :**
ఏపీలో ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "శత్రువులు ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు. అమిత్ షా తో మాట్లాడిన విషయాలు బయటి వాళ్లకు ఎలా తెలుస్తాయి?" అంటూ అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ నేత జైలుకెళ్లాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని పవన్ స్పష్టం చేశారు. "అలా అయితే జనసేన ఎదుగుతుందా? కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఇ లాంటి విషయాలు మాట్లాడతామా? ఇది మొత్తం వ్యవస్థను అవమానించడమే" అని వ్యాఖ్యానించారు. తాను అమిత్ షాను కలిసింది కేవలం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 26.05.2026
www.mudranews.in | @mudranews



### జుట్టు ఆరోగ్యానికి ఉసిరికాయ (ఆమ్లా)



ఉసిరికాయలో విటమిన్ సి మరియు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి, ఇవి జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి అకాల నిరుత్సాహాన్ని (తెల్లబడటాన్ని) అడ్డుకుంటాయి. రోజూ ఒక చిన్న ఉసిరికాయ ముక్కను తినడం లేదా జ్యూస్ రూపంలో తీసుకోవడం వల్ల జుట్టు సహజ రంగును కోల్పోకుండా ఉంటుంది.

### ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే
# చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

**ఏపీ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత హెచ్చరిక**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తే సీఎం చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై నమోదైన కేసులను అప్రజాస్వామిక చర్యలు గా అభివర్ణిస్తూ, ఇవి భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులని విమర్శించారు. సోమవారం "ఎక్స్" వేదికగా స్పందించిన కవిత, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ పై జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయిస్తున్నాయని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్‌పై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ సమాజం గౌరవించే మేధావిని వేధించడం తీవ్రంగా ఖండనీయ మన్నారు. ఆయన అభిప్రాయాలతో విభేదించవచ్చేమోగానీ కేసులు పెట్ట డం సరైంది కాదని అన్నారు. గతంలో తనపై చేసిన విశ్లేషణలను తాను కూడా వ్యక్తిగతంగా వ్యతిరేకించిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. అయినప్పటికీ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ విషయంలో టీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తున్నా రన్న వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే దాన్ని తెలంగాణ మేధావులపై ప్రత్యక్ష దాడిగా పరిగణిస్తామని హెచ్చరించారు. తెలంగాణ పోలీసులు కూడా ఏపీ పోలీసులకు సహకరిస్తున్నారన్న ప్రచారం ఉందని, అలాంటి చర్యలను నిలిపివేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా అధికార దుర్వినియోగం జరిగితే తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అన్నారు. ఇదే సందర్భంగా భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో వడదెబ్బతో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని మార్చురీ వాహనం లేక కుటుంబ సభ్యులు భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కూడా కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకన్నా అమానుష ఘటన ఉండదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం లారీలకు బ్రేక్

**మిల్లర్లకు మంత్రి జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో ధాన్యం కొనుగోలు, అన్ లోడింగ్ వ్యవహారంపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల మండలంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ ను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.రైస్ మిల్లుల్లో రోజులు తరబడి ధాన్యం లారీలను అన్ లోడ్ చేయకుండా నిలిపివేయడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని మిల్లు యాజమాన్యాలను హెచ్చరించారు. రైతులు రోజుల తరబడి లారీల్లో ధాన్యం ఉంచాల్సి రావడం బాధాకరమన్నారు. రైతులకు నష్టం కలిగించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ప్రతి లారీ వెంటనే అన్ లోడ్ అయ్యేలా రైస్ మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఎస్పీకి ఆదేశించారు. అవసరమైతే పోలీస్ నిఘా ఏర్పాటు చేసి పరిస్థితిని నియంత్రించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే మిల్లులకు తరలించి అన్ లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### మాటలు దంచుడు కాదు..
# దమ్ముంటే ధరలు దించు

**పెట్రోల్, డీజిల్ పై రాష్ట్ర పన్నుల భారం తగ్గించాలి**
**సీఎం కు హరీశ్ రావు లేఖ**



**ముద్ర, హైదరాబాద్ :** "మాటలు దంచుడు కాదు రేవంత్... దమ్ముంటే ధరలు దించు" అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టీ హరీశ్ రావు సీఎంకు సవాల్ విసిరారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ తగ్గించి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలో ఉండి రాష్ట్ర వ్యాట్ తగ్గించకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వరుసగా ఇంధన ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యాట్ తగ్గించకుండా ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ప్రస్తుతం పెట్రోల్ ధరలో సుమారు 35 శాతం, డీజిల్ ధరలో 27 శాతం వరకు రాష్ట్ర వ్యాట్ ఉందని పేర్కొన్నారు. పెరిగిన ధరల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి నెలకు రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు రూ.2 వేల కోట్ల అదనపు ఆదాయం వస్తోందని ఆరోపించారు. రైతులు ఇప్పటికే పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతుండగా, డీజిల్ ధరల పెరుగుదలతో మరింత సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని అన్నారు. సామాన్యుడు బైక్ నడపాలన్నా, ఆటో డ్రైవర్ బతుకు బండి లాగాలన్నా ఇంధన భారం భరించలేని స్థితి వచ్చిందన్నారు. ప్రజలు ఇంధన ధరలతో సతమతమవుతుంటే ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ ప్రజా పీడన పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు వ్యాట్ తగ్గింపుపై పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండున్నరేళ్లుగా కనీసం 0.1 శాతం కూడా వ్యాట్ తగ్గించలేదని మండిపడ్డారు. నిజంగా ప్రజా పాలన అందించాలనుకుంటే వెంటనే పెట్రోల్, డీజిల్‌పై కనీసం 10 శాతం వ్యాట్ తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.ఇంధన ధరల పెంపుపై కేంద్రాన్ని విమర్శిస్తున్న రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యాట్ విధానంపై కూడా స్పందించాలని, సీఎం రేవంత్ రెడ్డికి వ్యాట్ తగ్గించాలని సూచించాలని కోరారు.

# సముద్ర తీరం అభివృద్ధికి విజన్ ప్లాన్

**సముద్ర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ**
**తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు**
**నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం**



**ముద్ర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ లోని సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశం అయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఎకానమీలో భాగంగా సముద్ర ఆర్థిక వ్యవస్థ గురించే చర్చ జరుగుతోందని.. అపారమైన వనరుల్ని వెలికి తీస్తే విస్తృత ప్రయోజనాలు దక్కే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ అభివృద్ధి చేశామని.. రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆక్వా కల్చర్ లో వాల్యూ అడిషన్ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీంతో పాటు ఆక్వా వ్యర్థాలు కాలుష్య కారకంగా మారి పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించేలా పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే మెరైన్ బయోడైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో దొరికే రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని.. ఆ వనరుల్ని అందిపుచ్చుకోవాలన్నారు. తీరప్రాంత రక్షణ పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా సముద్ర తీరాల్లో మడ అడవులు, తాటి చెట్లు లాంటి మూడంచెల సహజ రక్షణ కవచం ఏర్పాటు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా సముద్ర తీరప్రాంతాలు తయారు కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే సీ వీడ్ అభివృద్ధి, మార్కెటింగ్ లాంటి అంశాలపై కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ సంస్థ ప్రతినిధి ఫిలిప్ తదితరులు హాజరయ్యారు.

## పరిశ్రమల రంగం మరింత బలోపేతం

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన "వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026" కార్యక్రమానికి సీఎం అతిథిగా హాజరై సమ్మిట్ నిర్వహిస్తున్న అంబేద్కర్ కళావేదికను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 38 ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్లగ్–అండ్–ప్లే పారిశ్రామిక మౌలిక వసతులతో ఈ పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికే తొలి రెండు దశల్లో 100 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేయడంతో పాటు కొన్ని పార్కులు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.అలాగే మెటా, అమెజాన్, జోహో వంటి ప్రముఖ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామీణ పారిశ్రామిక రంగానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించారు.సమ్మిట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్ఎంఈ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. మరోవైపు రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# మహిళా సాధికారతకు పెద్దపీట

**రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలతో ప్రజా ప్రభుత్వం రికార్డు**
**వడ్డీ లేని రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు**
**ఒకేసారి 8 వేల స్వయం సహాయక సంఘాల భవనాలకు భూమిపూజ**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8వేల సంఘాల భవన నిర్మాణాలకు వర్చువల్ విధానంలో జరిగిన భూమిపూజ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలను వివరించారు. గతంలో మహిళా సంఘాలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారని భట్టి గుర్తుచేశారు. పంచాయతీ కార్యాలయాల్లోనో, సభ్యుల ఇళ్లల్లోనో, చివరకు స్థలం లేక చెట్ల కింద కూర్చొని సమావేశాలు నిర్వహించుకునే దుస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ, మహిళలకు గౌరవప్రదమైన రీతిలో శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ 8 వేల కార్యాలయాల నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడు.. గత పదేళ్లుగా మహిళా సంఘాలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు హేళన చేశారని మండిపడ్డారు. ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామని చెప్తే విపక్షాలు నవ్వాయన్నారు."మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మా నిబద్ధతతో నిరూపించాం. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఏకంగా రూ.60,000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు అందించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాం. రాబోయే రెండున్నర ఏళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లే కాదు.. రూ.1,25,000 కోట్లకు పైబడేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. మా సాధించిన ఈ విజయమే నాడు విమర్శించిన వారికి చెంపపెట్టు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.మహిళా సంఘాలకు మరింత ఆర్థిక ఊతం ఇచ్చేందుకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల చొరవతో రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు./'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం' అనే లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. దీనిపై రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకానికి సంబంధించి నిర్దిష్టమైన టార్గెట్లు (లక్ష్యాలు) నిర్దేశించి, ఒక స్పష్టమైన టైమ్ క్యాలెండర్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారన్నారు. ఇది ప్రభుత్వం యొక్క సంకల్ప బలానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని భట్టి విక్రమార్క కొనియాడారు.మహిళా సంఘాల సభ్యులందరూ ఈ ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా మరింత పైపైకి ఎదగాలని, దేశానికే దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

### అంతర్ రాష్ట్ర సమన్వయంతో
# తాగునీటి సమస్యకు పరిష్కారం




**తెలంగాణ సాగునీటి హక్కులు, భవిష్యత్ అవసరాల పరిరక్షణకు చర్యలు**
**కృష్ణా జలాల సమన్యాయ వినియోగంపై రాష్ట్ర హక్కులను కాపాడుకునేలా చర్చలు**
**తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య సాగు,త్రాగునీటి వినియోగంపై సానుకూల చర్చలు**
**కృష్ణానదిపై ప్రాతిపదిత బ్యారేజ్ నిర్మాణ అంశాలపై సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చ**
**తెలంగాణ రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చల్లో పూర్తి ప్రాధాన్యత**
**పరస్పర అవగాహనతోనే కృష్ణా జలాల వినియోగం**
**ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**నీటివినియోగం పై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ –కర్ణాటక రాష్ట్రాల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు, సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో రాష్ట్ర సచివాలయంలో భేటి అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు. కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు. సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించి నిర్ణయం తీసుకుంటా మని పేర్కొన్నారు. ఈ భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నా రెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవితో పాటు రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసన్నగౌడ, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు, కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 25.05.2026
www.mudranews.in | @mudranews



### జుట్టు ఆరోగ్యానికి నల్ల నువ్వులు

నల్ల నువ్వులలో ఐరన్, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి తలలో రక్త ప్రసరణను పెంచి జుట్టు నల్లబడటానికి సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక స్పూన్ నల్ల నువ్వులను నమలడం లేదా లడ్డూ రూపంలో తీసుకోవడం జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది.



# సోమవారం కాళేశ్వరంలో భక్తుల సందడి

### వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాక

**మహదేవపూర్, ముద్ర:** శివునికి ప్రీతిపాత్రమని భావించే సోమవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పుష్కర స్నానం ఆచరించేందుకు భక్తులు కాళేశ్వరం చేరుకున్నారు. శివ నామస్మరణతో త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. పుష్కరంలో ఐదవ రోజు సోమవారం నాడు త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పునీతులై నీరాజనాలు అర్పిస్తున్నారు. భక్తుల తాకిడీ పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలలో నిమగ్నమయింది. పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. పుష్కరాల ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వానికి పెద్దపీట వేస్తారు. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దీప, ఇతర దానాలు చేయడం మంచిదని చెప్తున్నారు.





కాళేశ్వరంలో శ్రీ యోగానంద సరస్వతి స్వామీజీ

మహాదేవపూర్, ముద్ర: ఆదిలాబాద్ కు చెందిన శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామీజీ సరస్వతి అంత్య పుష్కరాల లో భాగంగా సోమవారం నాడు కాలేశ్వర క్షేత్రాన్ని సందర్శించి సరస్వతి పుష్కరాలలో భాగంగా పుణ్యస్నానము ఆచరించారు. శ్రీ యోగానంద సరస్వతి స్వామీజీని కాలేశ్వరం ప్రధాన ద్వారం నుండి మేళ తాళాలతో మంగళహారతులతో ఆలయ ఈవో మహేష్ ధర్మపత్రా మండలి చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు భక్తులు కలిసి తోడుకొని స్వామీజీల విడిది కేంద్రంగా ఏర్పాటుచేసిన త్రివేణి గెస్ట్ హౌస్ లో బస చేయించారు. అనంతరం ఆలయంలో అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికగా స్వామీజీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని శుభానందదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు, వేద పండితులు ఆశీర్వచనం పలకగా ఎండోమెంట్ అధికారులు సరస్వతి మాత జ్ఞాపికను స్వామి వారికి బహుకరించారు. దర్శనానికి ముందు స్వామివారు త్రివేణి సంగమ పవిత్ర తీరంలో పుష్కర పుణ్యస్నానం ఆచరించి భక్తులను ఆశీర్వదించారు.

**పుష్కరాలలో చిన్నారులకు ఆటవిడుపు**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తులు, వినోద కార్యక్రమాలు విశేషంగా అలరిస్తున్నాయి. పుష్కరాలకు విచ్చేస్తున్న కుటుంబాలతో పాటు వచ్చిన చిన్నారులు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. ఈ వినోద కార్యక్రమాలు పిల్లలకు ఆనందాన్ని పంచడమే కాకుండా, పుష్కరాల సందడిని మరింత ఆహ్లాదకరంగా మారుస్తున్నాయి. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు వినోదాన్ని కూడా అందిస్తున్న ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# హత్యకేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

**24 గంటల్లోనే హంతకులను గుర్తించిన పోలీసులు. జిల్లా ఎస్పీ నరసింహ**



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట రూరల్ పరిధిలోని ఏర్కారం గ్రామ శివారులో రోడ్డుకల్వర్టు కింద శనివారం గుర్తించిన మృతదేహం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.

హత్యకు గురైన వ్యక్తి ఏర్కారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త, 42 ఏళ్ల చింతలపాటి మధుగా పోలీసులు గుర్తించారు. మధు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సూర్యాపేటలోని కుడకుడ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో, అతని భార్య మౌనిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఏర్కారం గ్రామ శివారులో కల్వర్టు కింద గోనెసంచిలో మధు మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో ఏ2 నిందితుడు సైదులు అద్దెకు తీసుకున్న ఇంటిలోనే హత్య జరిగినట్లు గుర్తించారు. క్లూస్ టీం, దర్యాప్తు అధికారులు అక్కడి నుంచి కీలక ఆధారాలు సేకరించారు.

ప్రాథమిక విచారణలో పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు నిర్ధారించారు. 2007లో ఏర్కారం గ్రామ సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో చింతలపాటి మధు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ ఘటనకు ప్రతీకారంగా రవీందర్ కుమారుడు మిద్దె జీవన్ హత్యకు పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తు అధికారి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలోని బృందం టేకుమట్ల గ్రామం వద్ద జాతీయ రహదారి–65పై ఖమ్మం హైవే టీ జంక్షన్ వద్ద ఏ1 నిందితుడు మిద్దె జీవన్, ఏ4 నిందితుడు మిద్దె ఆనంద్‌ను అదుపులోకి తీసుకుంది. విచారణలో జీవన్ కీలక విషయాలు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. తన తండ్రి హత్యకు ప్రతీకారంగానే మధును చంపాలని నిర్ణయించుకున్నామని, మధు బతికి ఉంటే తన ప్రాణాలకు ప్రమాదమని భావించినట్లు జీవన్ ఒప్పుకున్నాడు.

ఈ హత్యకు సహకరించేందుకు సూర్యాపేట రూరల్ మండలం రామన్నగూడెంకు చెందిన ఏ2 చింత సైదులు, అర్వపల్లి మండలం రామన్నగూడెంకు చెందిన ఏ3 మేదిరి ప్రసాద్‌లను జీవన్ తనవైపు తిప్పుకున్నాడు. వీరంతా కలిసి మద్యం విందులు చేసుకునే వారు. మధును హత్య చేస్తే డబ్బులు ఇస్తానని జీవన్ వారిని ప్రోత్సహించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మధును ద్విచక్రవాహన ప్రమాదంలా చూపించి చంపేందుకు 2021లో ఒకసారి ప్రయత్నించగా విఫలమయ్యారని, మరోసారి నిమ్మికల్‌లోని ఫంక్షన్ హాల్ వద్ద హత్యకు ప్రయత్నించినా సాధ్యపడలేదని వెల్లడించారు. మధును హత్య చేసేందుకు సైదులు పేరుతో తాళ్లగడ్డలో అద్దె ఇల్లు తీసుకుని ఖర్చులన్నీ జీవన్ భరించినట్లు పోలీసులు తెలిపారు. సైదులు భార్య భవానికి కూడా ఈ విషయం చెప్పి సహకరిస్తే రూ.3 లక్షలు ఇస్తానని ఒప్పించినట్లు పేర్కొన్నారు. తాళ్లగడ్డకు చెందిన కక్కిరేణి భరత్‌ను కూడా ఈ కుట్రలో భాగస్వామిని చేశారని తెలిపారు.

శుక్రవారం మధ్యాహ్నం చేపలు, మద్యం తీసుకుని విందు చేసుకుందామని సైదులు, ప్రసాద్‌లు మధును ఇంటికి పిలిచారు. మధ్యాహ్నం 2 గంటలకు మధు అక్కడికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని సైదులు జీవన్‌కు ఫోన్ ద్వారా తెలియజేశాడు. అనంతరం జీవన్ ద్వారా భరత్ రెండు సార్లు మద్యం పంపించాడు.

రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో మధు మద్యం మత్తులో ఉండగా జీవన్, ఆనంద్‌లు కారులో అక్కడికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లిన వెంటనే ప్రసాద్ మధు చేతులు, కాళ్లు పట్టుకోగా, ముందుగానే సిద్ధం చేసిన మటన్ కత్తితో సైదులు దాడి చేశాడు. అనంతరం జీవన్ అదే కత్తితో మధు మెడ, ముఖం, భుజాలపై తీవ్రంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య అనంతరం మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి కారులో తీసుకెళ్లి ఏర్కారం శివారులోని కల్వర్టు కింద పడేశారు. మధు బైక్‌ను ఆనంద్ బాలెంల శివారులోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో వదిలేశాడు. అలాగే సైదులు, ప్రసాద్‌లు హత్యకు ఉపయోగించిన కత్తి, మధు సెల్‌ఫోన్‌ను అడివేముల గ్రామ శివారులోని కాలువలో పడేసి పరారయ్యారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా ఏ1, ఏ4 నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి వివరాల ఆధారంగా మరో ముగ్గురు నిందితులు ఏ2, ఏ3, ఏ6లను ఈనాడు కార్యాలయం సమీపంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుల నుంచి ఒక కారు, ఒక బైక్, హత్యకు ఉపయోగించిన కత్తి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ హత్యలు, భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.


గత హత్య కేసుల్లో నిందితులకు జీవితఖైదు శిక్షలు పడిన విషయాన్ని గుర్తుచేస్తూ, పోలీస్ శాఖ సాంకేతిక ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహిస్తోందని, పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులకు కేసులు పంపిస్తున్నామని తెలిపారు.

ఈ కేసులో సమర్థంగా పనిచేసిన సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు ఏడుకొండలు, శివతేజ, మహేందర్‌నాథ్, బాలు నాయక్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది, టెక్నికల్ టీంను ఎస్పీ అభినందించారు.

ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

# హర్మూజ్ రీ ఓపెన్!

**- ఓపెన్ చేసేందుకు ఇరాన్ అంగీకారం - చివరిదశలో అమెరికాతో చర్చలు**
**- మరో వారం రోజుల్లో సాఫీగా నౌకాయానం**



**ముద్ర డెస్క్:** దీర్ఘకాలంగా ఇరాన్–అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణానికి తెరదించే దిశగా ఒక కీలకమైన ముసాయిదా ఒప్పందం తుది దశకు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వివిధ మధ్యవర్తిత్వ దేశాల ప్రమేయంతో ఈ 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం దాదాపు ఖరారైనట్లు ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలోని కీలక అంశాలు ఇవే..

**హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని (Strait of Hormuz) 60 రోజుల పాటు ఎలాంటి పన్నులు (Tolls) లేకుండా స్వేచ్ఛా నౌకాయానం కోసం తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. ఇందులో భాగంగా జలసంధిలో తాము అమర్చిన మందుపాతరలను (Mines) తొలగించేందుకు ఇరాన్ సమ్మతించింది. దానికి ప్రతిగా, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయనున్నారు. దీనివల్ల ఇరాన్ ప్రపంచ దేశాలకు మళ్లీ స్వేచ్ఛగా చమురు విక్రయించుకునే వీలు కలుగుతుంది.

**అణు కార్యక్రమాలపై చర్చలు**

ఈ 60 రోజుల కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ తన అణు కార్యక్రమాలను నిలిపివేయడం, యురేనియం ఎన్రిచ్మెంట్ ను పరిమితం చేయడం, తన వద్ద ఉన్న నిల్వలను వదులుకోవడం వంటి అంశాలపై ఇరుదేశాల మధ్య లోతైన చర్చలు జరగనున్నాయి. అయితే, ఇరాన్ ప్రాథమికంగా వీటికి సంబంధించి కొన్ని మౌఖిక హామీలు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ ఒప్పందం ప్రకారం అమెరికా, దాని మిత్రదేశాలు ఇరాన్‌పై ఎలాంటి దాడులు చేయకూడదు. అదేవిధంగా ఇరాన్ కూడా అమెరికా లేదా దాని మిత్రపక్షాలపై ముందస్తు దాడులకు దిగకూడదనే నిబంధనను చేర్చారు. ఈ శాంతి ప్రక్రియలో భాగంగా ఖతార్ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్‌కు చెందిన 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.55 వేల కోట్లు) ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు సమాచారం. అంతేకాకుండా, లెబనాన్‌లో (ఇజ్రాయెల్–హిజ్బుల్లా మధ్య) కాల్పుల విరమణ అంశం కూడా ఈ చర్చల పరిధిలో భాగమైనట్లు తెలుస్తోంది.

ఈ 60 రోజుల తాత్కాలిక వ్యవధిలో ఆర్థిక ఉపశమనం అనేది ఇరాన్ పై ఆధారపడి ఉంటుందని అమెరికా స్పష్టం చేసింది. ప్రస్తుతం ప్రాంతీయ రక్షణ కోసం మోహరించిన అమెరికా సైనిక దళాలు ఇప్పుడే వెనక్కి వెళ్లవని, ఇరుదేశాల మధ్య పూర్తి స్థాయి తుది ఒప్పందం కుదిరి, అది పూర్తిగా నిరూపితమైన తర్వాతే తమ బలగాల ఉపసంహరణ ఉంటుందని వాషింగ్టన్ అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. కాగా ఈ చర్చల మధ్యవర్తిత్వంలో పాకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాలు కీలక పాత్ర పోషించాయి. ఈ ఒప్పందం కనుక విజయవంతంగా అమలైతే ప్రపంచ మార్కెట్లో చమురు సంక్షోభం తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట లభించనుంది.

### ప్లే ఆఫ్ రేసు

# ఈ నాలుగింటిలో గెలుపు ఎవరిది?

**ముద్ర డెస్క్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కు సంబంధించి లీగ్ సమరం ముగిసింది. హైదరాబాద్, గుజరాత్, బెంగళూరు, రాజస్థాన్ ప్లే ఆఫ్ వెళ్లిపోయాయి.. పాయింట్లు పరంగా చూసుకుంటే బెంగళూరు, గుజరాత్ జట్లు బలంగా కనిపిస్తున్నాయి. నెట్ రన్ రేట్ కూడా ఈ జట్లకు మెరుగ్గా ఉంది. అలాగని రాజస్థాన్, హైదరాబాద్ జట్లను అంత సులభంగా తీసుకోవడానికి లేదు.

గ్రూప్ దశలో జరిగిన పోరాటాలు ఒక విధంగా.. ప్లే ఆఫ్ దశలో పోరాటాలు మరొక విధంగా ఉంటాయి. అందువల్లే ఇప్పుడు జరిగే పోటీలను ఆటగాళ్లు పాయింట్ల పరంగా చూసుకోరు. నెట్ రన్ రేట్ పరంగా చూసుకోరు. కేవలం విజయమో.. వీర స్వర్గమో అన్నట్టుగానే భావిస్తారు. హైదరాబాద్, గుజరాత్ జట్లకు కాస్త వెసలు బాటు ఉంది. ఎందుకంటే ఆ రెండు జట్లకు రెండు అవకాశాలుంటాయి. కానీ హైదరాబాద్, రాజస్థాన్ జట్లకు మాత్రం ప్రతి మ్యాచ్ కూడా నాకౌట్ లాగే ఉంటుంది.

ఈ సీజన్లో గుజరాత్, హైదరాబాద్, రాజస్థాన్, బెంగళూరు.. ఇలా ఏ జట్టు ట్రోఫీ గెలిచినా సరే రెండవది అవుతుంది. ఎందుకంటే బెంగళూరు 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత గత ఏడాది విజేతగా నిలిచింది. ఈసారి కూడా ట్రోఫీ గెలిస్తే వరుసగా రెండవ సారి విజేతగా నిలుస్తుంది. గుజరాత్ కూడా 2022లో ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఇక ఈ సీజన్లో గనుక గుజరాత్ విజేతగా నిలిస్తే రెండవ టైటిల్ ఆ జట్టు ఖాతాలో ఉంటుంది.

హైదరాబాద్ 2016లో విజేతగా ఆవిర్భవించింది. 2024లో ఫైనల్ దాకా వెళ్ళినప్పటికీ ట్రోఫీ అందుకోలేకపోయింది. అయితే ఈసారి గెలిస్తే మాత్రం రెండవ ట్రోఫీ తన ఖాతాలో వేసుకుంటుంది.

రాజస్థాన్ 2008లో షేన్ వార్న్ నాయకత్వంలో ట్రోఫీ అందుకుంది. ఇంతవరకు మరొకసారి విజేతగా నిలవలేదు. అయితే ఈసారి గనుక ఆ జట్టు గెలిస్తే రెండవసారి ట్రోఫీ అందుకున్న చరిత్రను తన ఖాతాలో లిఖించుకుంటుంది.

ఈసారి ఐపీఎల్ లో ఈ నాలుగు జట్లు బలంగా పోరాటాన్ని సాగించాయి. ప్లే ఆఫ్ దశ దాకా వచ్చాయి. కొన్ని సందర్భాల్లో వెనుకబడినప్పటికీ.. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్లలో విజయాలు సాధించి ఇక్కడ దాకా వచ్చాయి. ఈ జట్ల మధ్య పోరాటాలు చూసేందుకు అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.



### జుట్టు ఆరోగ్యానికి బాదం పప్పులు

బాదంలో ఉండే విటమిన్ ఇ మరియు బయోటిన్ జుట్టుకు అవసరమైన మెలనిన్ ఉత్పత్తిని పెంచి, జుట్టు మెరిసేలా చేస్తాయి. రాత్రిపూట నానబెట్టిన 4-5 బాదం పప్పులను రోజూ ఉదయాన్నే తొక్క తీసి తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

## సీఎంను కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్



**ముద్ర కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ పూల బొకే అందించి శాలువాతో సన్మానించారు. బండి రమేష్‌ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలోని కమ్మ సంఘాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్పొరేషన్ ద్వారా పేదల ఆర్థికాభివృద్ధి, రాజకీయ చైతన్యం కోసం పని చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డిప్యూటీ చైర్మన్ పరుచూరి మురళి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- బండి రమేష్**




**ముద్ర కూకట్‌పల్లి :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు దేవాలయాల పరిరక్షణకు కూడా కట్టుబడి ఉందని తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా రాచమల్ల బిక్షపతి గౌడ్, సభ్యులుగా కావాలి పాండు, ఎం. రమేష్, మెట్టు వినోద్, పి. నర్సింగ్ రావు, నోముల బాబురావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావును బండి రమేష్ అభినందించారు. ఆలయాలు సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకలని పేర్కొంటూ భక్తి, సేవాభావంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పటోళ్ల నాగిరెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, గాలి బాలాజీ, కోపిశెట్టి దినేష్ కుమార్, తూము సంతోష్, రాచమల్ల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన రజక కార్పొరేషన్ చైర్మన్ అజయ్ కుమార్



**ముద్ర, కూకట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర వాషర్ మెన్ (రజక) కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దాసరి రాజు అజయ్ కుమార్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తొలిసారిగా కలిసిన అజయ్ కుమార్‌కు సీఎం శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ భేటీలో రజక సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కార్పొరేషన్ ద్వారా అమలు చేయా ల్సిన పథకాలపై చర్చించారు. రజక కార్పొరేషన్ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వాషర్‌మెన్ సమాజ సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత తొలిసారిగా రజకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుం టానని తెలిపారు. రజక యువతకు ఉపాధి అవకాశాల కల్పన, జీవో 102 అమలు, సమాజ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, బీసీ వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి తన నియామకమే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక కుటుం బాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా పనిచేస్తానని అజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

## నాలాల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వివేకానంద్



**ముద్ర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 130 – సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని గంపల బస్తీలో పర్యటించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ నిర్మాణంలో ఉన్న నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలాల నిర్మాణం ద్వారా వర్షాకాలంలో ముంపు తీవ్రతను తగ్గించడంతో పాటు వేగవం తమైన అభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికే నాలాల అభివృద్ధి దాదాపు నియోజక వర్గంలోని అన్నీ ప్రాంతాలలో పూర్తయిందని, గత పన్నెండేళ్ల కాలంలో ప్రణాళిక బద్ధంగా నాలాలను అభివృద్ధి పరిచామని అన్నారు.

పూర్తిస్థాయి నాలాల అభివృద్ధి ద్వారా "జీరో – ముంపు రహిత ప్రాంతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు.నాలా నిర్మాణ పనులలో పర్యవేక్షణ, పనుల్లో అలసత్వం తీరుపై అధికారులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విస్తరణ పనులతో పాటు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఇంజనీరింగ్ ఎస్.ఈ సక్కుభాయ్, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీ నారాయణ, అడప శేషు, దుర్గా రావు, రంగా, వెంకట్ రెడ్డి, రఘు శంకర్, ప్రసాద్, మణికంఠ, నదీమ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బడిమానేసిన ప్రతి చిన్నారి మళ్లీ బడిబాట పట్టాలి

**- కలెక్టర్ సీ ఎచ్ ప్రియాంక**




**ముద్ర, నారాయణపేట:** బడిమానేసిన ప్రతి చిన్నారి మళ్లీ బడిబాట పట్టాలనీ కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో బడిబాట కార్యక్రమ అమలు, నమోదు లక్ష్యాలు, గ్రామస్థాయి ప్రచార కార్యక్రమాలు, పాఠశాలల సిద్ధతపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, తండాలు, కాలనీల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గత మూడు సంవత్సరాల నమోదు వివరాలను విశ్లేషించి ఈసారి మరింత మెరుగైన నమోదు సాధించేలా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అవకాశం ఉన్న పాఠశాలల్లో అధిక శాతం నమోదు పెరిగేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, ఇంగ్లిష్ మీడియం, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలు వంటి సౌకర్యాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి వెంటనే పాఠ్యపుస్తకాలు అందజేసి, సంబంధిత వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆలుమ్ని కమిటీలు, ఆప్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూన్ 3న గ్రామసభలు, జూన్ 4 నుంచి 10 వరకు ఇంటింటి సర్వేలు, విద్యార్థుల నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నారు. జూన్ 12 నుంచి 19 వరకు పాఠశాల స్థాయిలో స్వాగత కార్యక్రమాలు, ఫౌండేషన్ లిటరసీ, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, డిజిటల్ అవగాహన, క్రీడా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

అంతకు ముందు కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్ కు 35 వినతులు రాగా కలెక్టర్ పిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు.

### 30లోగా పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** చేయూత పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ ప్రక్రియను మే 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 9లోగా 100 శాతం జనగణన ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో పారదర్శకత కోసం లైవ్ ఆథెంటికేషన్ కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు వంటి లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందించాలని సూచించారు. ఎవరూ పెన్షన్‌కు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

జనగణనకు సంబంధించిన రోజువారీ ప్రగతి నివేదికలు పంపాలని సూచించిన కలెక్టర్, జూన్ 9లోగా 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

## ఘనంగా మహిళా వారోత్సవాలు



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దముదునూరులో మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ కూచుకుల్లా దామోదర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురభి ఊర్మిళ, మార్కెట్ కమిటీ చైర్మన్ వేనేపల్లి రమణారావు, ఉపసర్పంచ్ ఎనమల కురు మయ్య, వార్డు సభ్యులు, గ్రామ సంఘాల అధ్యక్షులు జక్క నిర్మలమ్మ, పిట్ల సైదమ్మ, ఏపీఎం యాదగిరి, సీసీలు రాము, ధర్మయ్య, వీరేష్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతుల రాస్తారోకో



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్**

జిల్లాలోని తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. మహాలక్ష్మి గోదాం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు.

పది రోజులుగా మొక్కజొన్న సేకరణ పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసిన రైతులు, పంటను గోదాం వద్దకు తీసుకొచ్చినా కొనుగోలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు..

రైతుల ఆందోళనతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**




**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, ముద్ర ప్రతినిధి:** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమం కింద అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలికలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. పోషకాహార మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వివిధ ప్రాజెక్టుల నుంచి ప్రదర్శించిన ఆహార పదార్థాలను రుచి చూశారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవాలని, గ్రామీణ మహిళలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అంగన్వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం అంగన్వాడీల ద్వారా పోషకాహారం అందిస్తున్నదని తెలిపారు.

అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి నాణ్యమైన ఆహారం అవసరమని పేర్కొన్నారు.

మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, వంటల పోటీలు నిర్వహించారు. తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలతో తయారైన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. జంక్ ఫుడ్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీల విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పిడి డిఆర్డిఓ/డిడబ్ల్యూఓ శ్రీలత, సిపిఓ సౌమ్య, పరిశ్రమల జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, వయోజన విద్య డిప్యూటి డైరెక్టర్ అనిత, పిడి మెప్మా, సిడిపిఓ శాంతి కుమారి, సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 11 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజల నుంచి 11 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను విన్న ఎస్పీ, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. స్వీకరించిన అర్జీలలో భూమి వివాదాలకు సంబంధించినవి 3, న్యాయ సమస్యలకు సంబంధించినవి 6, భార్యాభర్తల వివాదాలకు సంబంధించినవి 2 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

### ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి

**ముద్ర ప్రతినిధి, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఉప్పల్ పరిధిలోని బాగాయత్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటా యించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉప్పల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

బాగాయత్ ప్రాంతంలో ఎంఎంసీ భవనం కోసం 10 ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఉప్పల్‌లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు సానుకూలంగా ఉందని తెలిపారు. వెంటనే స్థలం కేటాయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరినట్లు పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అబద్ధాల ప్రభుత్వం: కేటీఆర్




**ముద్ర, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లైనా నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా నని సవాల్ విసిరారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు గుప్పించారు. ముందుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లిని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. బాలానగర్, జేఎన్‌టీయూ, కైతలాపూర్ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, వాటర్ ట్యాంకులు, ఎస్టీపీ ప్లాంట్లు, పార్కులు ఏర్పాటు చేసి రూపురేఖలు మార్చామని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు నిధులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం కేటీఆర్ ఎస్ఐఆర్ నమోదు, ఓట్ల తొలగింపు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఓటు హక్కుపై ప్రజలకు ఎలా వివరించాలో కార్యకర్తలకు సూచనలు చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో మాధవరం కృష్ణారావును గెలిపించిన కూకట్‌పల్లి కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని కేటీఆర్ ప్రశంసించారు. భవిష్యత్తులో లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజల్లో పని చేసే వారికే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు నిరంతర మంచినీటి సరఫరా అందిస్తామని కేటీఆర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంభిపూర్ రాజు, గజ్జల నాగేష్, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.05.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### జుట్టు ఆరోగ్యానికి పాలకూర (ఆకుకూరలు)



పాలకూరలో ఐరన్, ఫోలేట్ మరియు విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి, ఇవి జుట్టు ఊడకుండా కాపాడటంతో పాటు నల్లగా పెరగడానికి దోహదం చేస్తాయి.



## ప్రజా పాలన అంటే ప్రజలను రోడ్డున పడేయడమా?!

- పెట్రోల్, డీజిల్ ధరలకు కాంగ్రెస్ ధర్నా చేస్తది
- వడ్లు కొంటలేరని బీజేపీ వాళ్లు ధర్నా చేస్తారు: మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- రాయికల్లో ధర్నా చేస్తున్న రైతులకు సంఘీభావం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన అంటే ప్రజలను రోడ్డు ఎక్కివడమా..? అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలోని రహదారిపై సోమవారం ధర్నా చేస్తున్న రైతులకు మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ లు తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కాంగ్రెస్ ధర్నా చేస్తది, అలాగే వడ్లు, మొక్కజొన్నలు కొంటలేరని బిజెపి వాళ్లు ధర్నా చేస్తారని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వరికి బదులు మొక్కజొన్న, పప్పు దినుసులు పండించాలని ప్రభుత్వం చెప్పిందని, దీంతో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఖరీఫ్ లో వరి సాగు చేసిన రైతు రబిలో మొక్కజొన్న వేశారన్నారు. మొక్కజొన్న ప్రతి ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తాయని, ప్రభుత్వం 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్తున్నారని, అయితే 25 క్వింటాల్లు కొంటే మిగతా 15 క్వింటాల్లు ఎటు పోవాలని ప్రశ్నించారు. రైతు భరోసా ఎలాగో ఇవ్వడం లేదని, కెసిఆర్ ఎకరానికి రూ.10,000 ఇచ్చారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి చెప్తే నమ్ముతారో నమ్మరో అని రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ లో వరి పంటతో పాటు ప్రతి పంటకు బోనసు ఇస్తామని చెప్పినారని, అయిన బోనస్ కూడా లేకుండా పోయిందన్నారు. వరి ధాన్యంతో పాటు అన్ని రకాల పంటల కొనుగోలు విషయంలో కెసిఆర్ కు ఘనత దక్కుతుందని, ప్రభుత్వం మారగానే విధానం విధానాలు మాయమైపోతాయా? అని ప్రశ్నించారు. రాయికల్ మార్కెట్లో తూకం వేసిన మొక్కజొన్న 20 రోజులు అవుతుంది. రోహిణి కార్తె ఆరంభం నాటికి వరి మొక్కజొన్న కొనుగోలు పూర్తయ్యేటివని, ఇప్పటివరకు కొనుగోలు చేయకపోవడం ఇదే మొదటిసారి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వివిధ హోదాలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## పిల్లలకు పోషకాహారం అందించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

**మహదేవపూర్, ముద్ర:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో తొలి రోజు సోమవారం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "సే నో టు జంక్ ఫుడ్" అనే నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్ ల ను ఏర్పాటు చేశారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు మరియు ఇతర పోషకాహార పదార్థాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. ఈ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి వివిధ వంటకాల తయారీ విధానం, వాటి పోషక ప్రయోజనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి అనే నినాదంతో నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన, సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి మల్లీశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఫిర్యాదు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల పట్టణ కేంద్రంలోని విలువైన 'సర్దార్ సత్రం' ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా చేపట్టిన కమర్షియల్ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కు సోమవారం వినతి పత్రం అందజేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సత్రం భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి అని, అలాంటి స్థలంలో అక్రమ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడం అత్యంత దుర్మార్గమని నాయకులు అన్నారు. ఈ స్థలం గతంలో రైతులు, చిరు వ్యాపారుల విశ్రాంతి కోసం ప్రజల సహకారంతో ఏర్పాటు చేయబడిందన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం మాదిగ, పట్టణ అధ్యక్షులు బొల్లారపు దివాకర్ మాదిగ, అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టపెల్లి లక్ష్మణ్ మాదిగతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధుల బహిష్కరణ



**ముద్ర, కోరుట్ల :**

తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ను హైదరాబాద్ మాసబ్ ట్యాంకు ప్రాంతంలో శనివారం రోజున దుండగులు కారుతో ఢీకొట్టి హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రోజు న్యాయవాదులు కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, న్యాయవాదులకు రోజురోజుకు రక్షణ లేకుండా పోతుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రత్యేకంగా న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. నిందితులను త్వరగా పట్టకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి రమేష్, కొంపల్లి సురేష్, గోసికొండ సురేష్, గాంధారి శ్రీనివాస్, చిలువేరి రాజశేఖర్, వూరడి నరేందర్, రాములు, రామకృష్ణ,ప్రేమ్ సాగర్,సూర్య నారాయణ ప్రసాద్, వందన, ప్రేమ్ కుమార్, గౌతమ్, వివేక్, వినయ్, గణేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

- బీజేపీపై కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు ఎందుకు మాట్లాడంలేదు..?
- ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు.. ?
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- జగిత్యాలలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై నిరసన కార్యక్రమం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**



కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనె తగ్గించాలని రాష్ట సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసి, ఆ తర్వాత ఆర్డీవోకు వినతి పత్రం అంజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం మాట్లాడలేదని అన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ, పచ్చిమబెంగాల్ లో ఎన్నికలు పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని, దీని అర్థం మన దేశ ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చని అన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని ఆరోపించారు. రాష్టంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్ఎస్ నాయకులు నోరు మెదపడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మొక్కజొన్నల కొనుగోలుపై లేదని మంత్రి ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎఫ్సీఐ మాత్రం రాష్ట ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదని అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు తగ్గించాలని రాష్టంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల మున్సిపాల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు జగిత్యాల జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా అభివృద్ధే దేశ ప్రగతికి పునాది

- మేయర్ కొలగాని శ్రీనివాస్

**ముద్ర, కరీంనగర్ :**



కరీంనగర్ నగర అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళల ఆర్థిక, సామాజిక శ్రేయస్సే దేశ ప్రగతికి బలమైన పునాది అని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో కళాభారతిలో నిర్వహించిన 'మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి' కార్యక్రమాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన మేయర్ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబన పెరిగితే కుటుంబాలు బలపడతాయని, సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో త్వరలోనే 'మహిళా శక్తి భవనాలు' ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ వెల్లడించారు. ఈ భవనాల ద్వారా మహిళలకు శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, సమావేశాల నిర్వహణకు అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మేయర్ తెలిపారు. మహిళలు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ప్రభుత్వ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మహిళా శక్తి భవనాల ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతించారు.

## మహిళా వారోత్సవాల్లో చీరల పంపిణీ



**ముద్ర, కరీంనగర్ :**

కరీంనగర్ కళాభారతిలో సోమవారం మహిళా వారోత్సవాలు జరిగాయి. ఈ మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ, మెప్మా, మున్సిపల్ శాఖల సిబ్బంది పనితీరును కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా వారోత్సవం

**ముద్ర, కోరుట్ల;**

ప్రభుత్వ ఆదేశానుసారం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో సోమవారం రోజున కోరుట్ల మండలం ఐలాపూర్ పి హెచ్ సి పరిధిలోని దాదాపు 43 మంది గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దొరికే చిరుధాన్యాలు ఆకుకూరలు "మై ప్లేట్ ఫర్ ద డే" ప్రకారం రోజువారి ఆహారంలో కనీసం 8రకాల ఆహారాలు ఉండాలని, ప్రతి రోజు తినే ఆహారంలో కచ్చితంగా పీచు పదార్థాలను తప్పకుండా వాడాలన్నారు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఎక్కువగా కొవ్వులు, చక్కెర, ఉప్పు ఉన్న పదార్థాలను పానీయాలను తీసుకోవడం తగ్గించాలని సూచించారు. రోజుకు తగినంత నీరు తీసుకోవాలని, శీతల పానీయాలకు బదులుగా మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం తీసుకోవాలని ప్రతిరోజు నడక యోగ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. దాదాపు 70 మందితో పోషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లు అలేఖ్య, రాధిక, ఏం ఓ సమీనా తబస్సు, సూపర్వైజర్ జస్సి కుమారి, ఏఎన్ఎం యమున, అంగన్వాడి టీచర్లు మంజుల, సుజాత, కాలేశ్వరి భాగ్యలక్ష్మి, విమల, శైలజ, సుజాత, సుమతి, అంగన్వాడి ఆయాలు మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి
- కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయడంతో పాటు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం మండలంలోని పూడూరు, డబ్బు తిమ్మయ్యపల్లి, మల్యాల మండలం తకళ్లపెల్లి, బల్వాంతపూర్, రామన్నపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి , తహసీల్దార్లు , ఎంపిడివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ కార్మికుల సమస్యలపై వినతి

**ముద్ర, కోరుట్ల;**

కోరుట్ల డిపో రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలపై ధర్నా చేయడం జరిగింది. ఇందులో ప్రధాన సమస్యలు 2017 ఆర్ పి ఎస్ ఫిక్సేషన్ చేసి ఏరియర్స్ ఇచ్చుట ,గురించి 2025 వరకు ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు రావాల్సిన బకాయిలు గురించి కోరుట్ల డిపో గేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ కు రిటైర్డ్ కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోరుట్ల డిపో రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు అధ్యక్షులు రాణా ప్రతాప్ సింగ్, కార్యదర్శి రాజా గంగారాం, కిషన్ రావు, కెవి స్వామి, లక్ష్మణ్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాటారంలో వడ్ల బస్తాలకు నిప్పంటించిన రైతులు

**మహాదేవపూర్, ముద్ర:**

సుమారు నెల 15 రోజులుగా కల్లాలోని వడ్లను ప్రభుత్వం రవాణా చేయకపోవడంతో వాటిని కాపాడలేక రైతులు తీవ్రఅవస్థల గురైన రైతులు కాటారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి, నిరసనతో వడ్ల బస్తాలకు నిప్పంటించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వడ్లను కాంటావేసి తరలించాలని రైతు రుణ డిమాండ్ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 26.05.2026
www.mudranews.in | @mudranews



## జుట్టు ఆరోగ్యానికి కోడిగుడ్లు



కోడిగుడ్డులో ఉండే హై-క్వాలిటీ ప్రొటీన్ మరియు బయోటిన్ జుట్టు నిర్మాణాన్ని (కెరాటిన్) బలోపేతం చేసి, జుట్టుకు సహజమైన రంగును ఇస్తాయి. రోజుకు ఒక ఉడికించిన గుడ్డు తినడం వల్ల జుట్టుకు అవసరమైన అన్ని పోషకాలు సులభంగా అందుతాయి.

## నూతన వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి



**ముద్ర, బీబీనగర్ :** వీబీజీ రాంజీ పథకం జూన్ ఒకటి నుంచి పేరు మార్చుకొని వస్తున్న పథకంతో కూలీలకు అనేక నష్టాలు జరుగుతాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని జమీల పేట గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల వలసలు ఆపడం కోసం యూపీఏ వన్ గవర్నమెంట్ లో భాగమైనటువంటి కమ్యూనిస్టు పార్టీ నాయ కత్వంలో వలసను ఆపే ప్రయత్నంలో భాగంగా ఈ చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కూలీల మీద కక్ష కట్టి పేరు మార్చడమే కాదు చట్టంలో అనేక లోసుగులు పెట్టి రాబోయే కాలంలో కూలీలకు కూలి లేకుండా చేయడం కోసమే జరుగుతుందన్నారు. బడ్జెట్లో కేటాయించిన డబ్బులు వేరే ఇతర పనులకు ఉపయోగించుకోవచ్చని వీటిపై సర్పంచులకే అధికారం ఉంటుందన్నారు. ఇదే గనుక జరిగితే ఒక్కరోజు కూడా కూలి దొరకడం కష్టమన్నారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డబ్బులు ఉపాధి పనిలో ఖర్చు చేయాలని నిర్ణయించడం సరైనదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శ్రీరాములు, నాయకులు రేసు రామచంద్ర రెడ్డి, చినాల లలిత, మిరపకాయల మంగమ్మ, చినాల రజిత, వంగూరి పోచమ్మ, వరిగంటి గంగమ్మ, చినాల జానమ్మ, పత్తి అంజమ్మ, కుక్కుట్ల ఎల్లమ్మ పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ ఎత్తివేస్తే ఉద్యమం తప్పదు



**ముద్ర, తుంగతుర్తి:** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఆర్ డి ఎస్ ఎస్..( రివ్యాంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కిం) ప్రీ.పెయిడి మీటర్ల విధానాన్ని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయానిప్రయత్నం చేస్తుంది అని ఈ విధానం వలన లక్షలాది మంది రైతాంగానికి వ్యవసాయ విద్యుత్ అనేది గుదిబండగా మారనుందని మండల మాజీ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ మోటార్ కనెక్షన్ కోసం ఇప్పుడొస్తున్న ప్రభుత్వ సబ్సిడీ పూర్తిగా ఎత్తి వేసి మొత్తం అయ్యే ఖర్చు రైతు నెత్తినమోపబడుతుందని అన్నారు .ఉచిత విద్యుత్ అనేది రాష్ట్ర ప్రభుత్వం చెప్పకనే రద్దు చేస్తుందని అన్నారు. రెండువందల యూనిట్లు ఫ్రీ గా పొందే గృహ వినియోగ దారులుగా ఉన్న పేద మధ్య తరగతి చెందిన ప్రజలందరూ ముందుగానే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దాపురిస్తుందని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా లొంగకుండా తాను రాష్ట్ర రైతాంగానికి మోటార్లవద్ద మీటర్లు బిగించేది లేదని తెగేసి చెప్పడం జరిగిందని అని అన్నారు. అట్లాంటి నాయకుని ప్రభుత్వాన్ని పోగొట్టుకొని రేవంత్ రెడ్డి మాటలు విని ఓట్లేస్తే ప్రజల రైతుల పాలిట గుదిబండలాగాగ మారారని అన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక, రైతు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీ, బిజెపి ప్రభుత్వాలకు తగిన గుణ పాఠం చెప్పాలని అన్నారు.. రైతులకు ,ప్రజలకు, భారమయ్యే ఆర్ డి ఎస్ ఎస్ కేంద్ర విద్యుత్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు . జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు గాజుల యాదగిరి, గోపగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ ఏర్పాట్లు పూర్తి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** బక్రీద్ పండుగ పురస్కరించుకొని పట్టణం లో ఉన్న ఈదాలలో మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, కమిషనర్ భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది తో ఏర్పాట్లు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కతీఫ్ ఫరూక్, వార్ కౌన్సిలర్లు ఎండి.షఫీక్ అహ్మద్, ఎండీ.లాయిక్ అహ్మద్, ఎండీ బురహన్, కో ఆప్షన్ సభ్యులు ఎండీ.కౌసర్, ఎండీ.షరీఫ్, ఇక్బాల్ చౌదరి, ఎండీ.కాజమ్, ఎండీ.నజీర్, షరీఫ్ పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.పద్మ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం ఎలగందుల అంజయ్య అధ్యక్షతన భువనగిరిలో జరిగింది. ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేయటం లో జరుగుతున్న జాప్యంతో రైతులు నిరాశ చెందకుండా ధైర్యంగా ఉండాలని రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నామ మాత్రంగా కంటితుడుపు చర్యగా పెంచిన ధరల పత్రాలను కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను భువనగిరిలో గంజి చౌరస్తా వద్ద దగ్ధం చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన ప్రతిపాదన ప్రకారంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి, రైస్ సంఘం జిల్లా కార్యదర్శి కొల్లు రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పల కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బంగారు, ఆంజనేయులు, అంబటి అంజయ్య, పకీర నాయక్, మొగుళ్ల తిరుపతిరెడ్డి, బి సుదర్శన్ రెడ్డి, గణేశ, ఊట్కూర్ కృష్ణ, సిద్దిరాములు, శోభన్ బాబు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోపు టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
**డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలి**
**యాతాలకుంట టన్నెల్ ను పరిశీలన**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టు ను ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరా సాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు. 2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయని అన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగుతున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. సత్తుపల్లి ట్రంక్‌లో భాగమైన యాతాలకుంట టన్నెల్ ద్వారానే ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా అవుతుందని వివరించారు. గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాల కు సాగునీరు అందిస్తామని తెలిపారు. టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయన్నారు. ప్రధాన కాలువ భూసేకరణ పూర్తి చేసిన కలెక్టర్లకు మంత్రి అభినందనలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11వేల ఎకరాల భూమి అవసరమని, భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపిందని తెలిపారు. మొదట పినపాక, తరువాత కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ ఏడాదిలోనే ప్రయోజనం చేకూరుతుందని, కాలువల పనులు త్వరగా పూర్తవ్వాలంటే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసి భూసేకరణకు సహకరించాలని కోరారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైసు మిల్లుల తనిఖీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రైస్ మిల్లుల వద్ద ధాన్యం లోడ్ తో వచ్చిన లారీలు వెంట వెంటనే అన్లోడ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం బీబీనగర్ భట్టు గూడెం లోనీ కాదంబరి రైస్ మిల్లు, పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి లోని సోమేశ్వర రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్ మిల్లులో దాన్యం లోడు లారీలు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. లోడ్ తో వచ్చిన లారీలను ఎప్పటికపుడు అన్లోడ్ చేయాలన్నారు. ప్రతి రోజు ధాన్యం లోడుతో ఎన్ని లారీలు మిల్లుకు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో లారీ అన్లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకొని వచ్చిన వెంటనే హమాలీలతో అన్లోడ్ చేయించాలన్నారు. ధాన్యం అన్లోడ్ చేయడం కోసం మిల్లులో హమాలీలు సరిపడా ఉన్నారా లేదా అని ఆరా తీసి సరిపడ హమాలీలు లేకపోతే ఎక్కువ మందిని పెట్టుకొని ధాన్యం దిగుమతి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితి లోనూ మిల్లుల వద్ద ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలు ఆగడానికి వీలు లేదన్నారు. ఏ రోజు వచ్చిన లారీ ఆరోజే అన్లోడ్ చేసి పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే లారీలను తిరిగి పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రాణి మండల తాసిల్దార్లు శ్రీనివాస్ రెడ్డి శ్యాంసుందర్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి 85 అర్జీలను స్వీకరించారు. రెవిన్యూ శాఖ 45, జిల్లా గ్రామీణాభివృద్ధి 12, సర్వే ల్యాండ్ 17, హౌసింగ్ 3,మున్సిపాలిటీ 4, జిల్లా గ్రామీణాభివృది,పంచాయతీ , యస్ సి కార్పొరేషన్, విద్యా, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం భూ సమస్యలకి సంబంధించి 54 దరఖాస్తులు, డిఆర్డిఏ 7, డీపీఓ 5, ల్యాండ్ రికార్డ్స్ 4, డిడబ్ల్యుఓ 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 92 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, హౌసింగ్ పీడీ సిద్దార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు...

# ప్రజా పాలనలోనే సామాజిక న్యాయం

**మోత్కూర్ లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**
**ఎమ్మెల్యే మందుల సామేలు**



**ముద్ర, తుంగతుర్తి:** ఈనెల 29న మోత్కూరులో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా ఎన్నికైన ప్రత్యేక తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకురాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మనమరాలు చిట్యాల స్వాతి, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి మాతృమూర్తి శంకరమ్మలకు నిర్వహించే సన్మాన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. సోమవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ఈ సన్మాన సభకు జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరుకానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్పంచులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బికోజి,జిల్లా నాయకులు రేగటి రవి, సుంకరి జనార్ధన్,రేగటి వెంకటేష్, పొన్నాల సృజన్ దాసరి శ్రీను, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, మాచర్ల అనిల్, గంగరాజు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూ జే



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జర్నలిస్టులను కష్టకాలంలో ఆదుకొని, వారి సమస్యలను పరిష్కరించి జర్నలిస్టులకు అండదండగా ఉండేది కేవలం టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమే అని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రెడిటేసన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సభ్యత్వం నమోదు సందర్భంగా మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృ ద్ధి, హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు ఇలా ఏ జర్నలిస్టుకు కూడా అవసరమైన అన్ని రకాల సదుపాయాల కోసం కృషి చేస్తుందని వివరించారు. సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ క్యాంపెయిన్ కు అనూహ్య స్పందన లభిస్తుందని, రెండు రోజుల్లో సభ్యత కార్యక్రమం ముగుస్తున్నందున ఇంకా ఎవరైనా చేరాలనుకుంటే జిల్లా, మండలాల బాధ్యులను సంప్రదించాలని కోరారు.కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయకుమార్, జిల్లా నాయకులు పులుసు నాగరాజు, సుంకర పోయిన వెంకటయ్య, కందుల నాగరాజు, ముద్ర సూర్యపేట జిల్లా ప్రతినిధి తండు వెంకన్న గౌడ్, షేక్ రషీద్, ఉయ్యాల నరసయ్య, లింగాల సాయిబాబా, దుర్గం బాలు, వెంకన్న, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# "శత ప్రశ్న శరసంధానం" గ్రంథం ఆవిష్కరణ

**సాయిబాబాపై ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో గ్రంథం**
**సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి 11 భాషల్లో రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించిన సిద్ధగురు**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. సోమవారం నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రమణానంద మహర్షి మాట్లాడుతూ షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు, ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించడం విశేషం. భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి ప్రసంగిస్తూ, ఏ ఆధ్యాత్మిక మహానుభావుడి గురించి అయినా అవగాహన లేకుండా విమర్శలు చేయడం సమాజంలో అయోమయానికి దారితీస్తుందని అన్నారు. సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తుల సందేహాలకు సమగ్ర సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.05.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### జుట్టు ఆరోగ్యానికి నల్ల ద్రాక్ష

నల్ల ద్రాక్షలో ఉండే 'రెస్వెరాట్రాల్' అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, జుట్టు తెల్ల బడకుండా నియంత్రిస్తుంది. సీజన్ లో తీసుకోవడం వల్ల జుట్టు ఒత్తుగా, నల్లగా మారుతుంది.



## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్య పడొద్దు : కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి,, మెదక్ :**

రైతులు అధైర్య పడద్దని , ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ ప్రతిమాసింగ్ భరోసా ఇచ్చారు. సోమవారం నర్సాపూర్ సాయి కృష్ణ రైస్ మిల్, నర్సాపూర్ లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఎంసిఎస్ జగదీష్, డిఎస్ఓ నిత్యానంద్, తహసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా అవసమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అత్యంత వేగంగా ధాన్యం అన్లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శివంపేట మండలం దొంతి గ్రామంలోని కామాక్షి బాయిల్డ్ రైస్ మిల్లును సివిల్ సప్లై అధికారులతో కలిసి అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈవో ఎల్లయ్య, ఆర్ అండ్ బీ ఈఈ వేణు, డీఎంహెచ్ఓ శ్రీరామ్, డిఎస్పీలు, జాతీయ రహదారి అధికారులు, రవాణా శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషన్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడారు. మెదక్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పతాకావిష్కరణ, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల సందేశాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించేల కార్యక్రమాలను రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జెడ్పీ సిఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

- నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

**ముద్ర ప్రతినిధి మెదక్ :**

ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ టిపిసిసి అధికార ప్రతినిధి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని సోమక్కపేట గ్రామపంచాయతీ పరిధిలోని గంగిరెద్దులగూడెంలో నిర్మాణం పూర్తయిన ఇంటిని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల టిఆర్ఎస్ హయంలో పేదలకు ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదింటికల నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచ్ బెస్త దుర్గ చలం, ఉపాధ్యక్షుడు పండరి, విశ్వంభర స్వామి, తారా విష్ణువర్ధన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ ఎల్అండ్టీ గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన ఎస్పీ

**మహదేవపూర్, ముద్ర:**

భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామ సమీపంలోని ఎల్ &టి గెస్ట్ హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహాదేవపూర్ మండలం, గత ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదం లో గెస్ట్ హౌస్ తో పాటు అందులోని ఎలెక్ట్రిక్ వస్తువులు, ఫర్నీచర్, ఇతర విలువైన వస్తువులు,సిబ్బందికి చెందిన సామాన్లు పూర్తిగా కాలిపోయినవి. వాటి విలువ విలువ సుమారుగా ఒక కోటి నలభై ఎనిమిది లక్షల పదకొండు వేల ఏడు వందల తొంభై ఐదు రూపాయలగా ఉంటుంది అని ఎల్ &టి గెస్ట్ హౌస్ ఇంచార్జ్ తపాస్ కుమార్ నాయక్ పోలీస్ స్టేషన్లో ఎస్. ఐ కె పవన్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అగ్నిప్రమాదం సమాచారం అందిన వెంటనే సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు.

# కొనుగోళ్లలో వేగం లేకపోతే కలెక్టరేట్ ముట్టడి

- ఎన్సాన్‌పల్లి వడ్ల కొనుగోలు కేంద్రంలో ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సోమవారం సందర్శించారు. కల్లాల్లో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు ఇవాళ హరి గోస పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతులంటే పట్టింపు లేదని విమర్శించారు. యూరియా సరఫరా, కరెంట్, రైతుబంధు ఇవ్వడంలో విఫలమైన ప్రభుత్వం.. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను కొనుగోలు చేయడంలో కూడా పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కాకుండా, ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో కూడా రైతులకు ఇంత కష్టం రాలేదన్నారు. రాష్ట్రంలో కోటి 40 లక్షల టన్నుల దిగుబడి వస్తుంటే.. నిన్నటి వరకు 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇప్పుడు 70 లక్షల టన్నులే కొంటామంటున్నారని విమర్శించారు. మిగతా 70 లక్షల టన్నులు రైతులు దళారులకు అమ్ముకుని నష్టపోవాలా అని ప్రశ్నించారు. వడ్లు కొనలేక కేంద్ర ప్రభుత్వంపై నెపం మోపుతున్నారని ఆరోపించారు. కేంద్రం కొనకపోయినా ఆనాడు కేసీఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో ధర్నా చేసి కేంద్రాన్ని ఒత్తిడికి గురిచేశారని గుర్తు చేశారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. మీకు చేతనైతే ఢిల్లీ వెళ్లి పోరాడండి కానీ రైతులను నట్టేట ముంచొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు తీస్తే తోలు తీస్తానని సీఎం రేవంత్ రెడ్డి, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఏసీ గదుల్లో కూర్చుని డైలాగులు చెబుతున్నారని విమర్శించారు. తన నియోజకవర్గంలోని నంగనూరు, ఖానాపూర్, ఖాతా, వెంకటాపూర్, నర్మేట, పాలమాకుల, సిద్దిపేట అర్బన్, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, రావురూకల్, రాఘవాపూర్, మల్లారం, సికింద్లాపూర్ తదితర గ్రామాల నుంచి రైతులు ఉదయం నుంచే ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. మిల్లుల్లో బస్తాకు 43 కిలోలు పెడితేనే దించుకుంటామని మిల్లర్లు రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. దీనివల్ల ఎకరాకు 150 కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని డీఎస్ఓ దృష్టికి తీసుకెళ్తే.. "మీరు మిల్లర్లతోనే మాట్లాడుకోండి" అని బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారని విమర్శించారు. ఏ ఒక్క మంత్రి కూడా కొనుగోలు కేంద్రాలకు రావడం లేదన్నారు. మిట్టపల్లి, నంగనూరు, చిన్నకోడూరులో రైతులు రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. వర్షాలకు తడిసి వడ్ల కుప్పల వద్దే మెదక్ జిల్లా కొల్చారంలో ఓ రైతు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 10 నుంచి 12 మంది రైతులు కల్లాల్లో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో కూర్చుని "మిషన్ మోడ్" అంటూ పేపర్ టైగర్‌లా డైలాగులు చెబుతున్నారని విమర్శించారు.
వడ్లు కొనుగోలు చేసే విధానం చూస్తే నత్తలు కూడా సిగ్గుపడతాయన్నారు. ముఖ్యమంత్రిది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్ అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో రైతుల కష్టాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. మార్చి 22న సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చి 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుబంధు వేస్తామని సీఎం చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇవాళ్టికి 63 రోజులు అయినా.. రెండు ఎకరాల రైతులకు తప్ప మిగతా వారికి పూర్తి స్థాయిలో రైతుబంధు అందలేదన్నారు. కొమురెల్లి మల్లన్న, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, ఏడుపాయల అమ్మవారు, మెదక్ చర్చి పేర్లపై ఒట్లు పెట్టి కూడా రుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. ఎన్సాన్‌పల్లి కేంద్రంలో నెలన్నర రోజుల్లో కేవలం ఆరు లారీలు మాత్రమే వచ్చాయని తెలిపారు.
వర్షాలకు వడ్లు తడిసి, కింద సీసీ లేక మట్టిలో కలిసిపోయి చెదలు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వెంటనే లారీలు, సంచులు పంపించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు 60 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఆ ఢిల్లీ పర్యటనల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం గారడీ మాటలు మానేసి తక్షణమే గన్నీ బ్యాగులు పంపించాలని డిమాండ్ చేశారు. "మీరు ఎన్ని తిట్టినా భరిస్తాం.. కానీ రైతులకు కాంటాలు పెట్టండి, లారీలు పంపండి" అని అన్నారు. నాగలక్ష్మి అనే మహిళా రైతు మక్కలు అమ్మి రెండు నెలలు అయినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. వెంటనే మక్కలు, సన్‌ఫ్లవర్, జొన్నలు అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.
రెండు, మూడు రోజుల్లో వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచి, తరుగు లేకుండా కొనుగోలు చేసి, లారీలు, గన్నీ బ్యాగులు పంపకపోతే.. స్వయంగా వేలాది మంది రైతులతో కలిసి నిరవధిక ధర్నా చేపట్టి కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి మెదక్:**



జిల్లాలో మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా శంకస్థాపన అనంతరం మహిళా సమాఖ్య సభ్యులను ఉద్దేశించి కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... జిల్లాలో మహిళలని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మహిళలు విభిన్న వ్యాపారాలైన పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, గోడౌన్, రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్, క్యాంటీన్లు, మరిన్ని వ్యాపార లక్ష్యాలతో ముందుకు వస్తే భూమి కేటాయించడానికి, లోన్లు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని , మహిళలందరూ ముందుకు వస్తే వారికి అన్నీ అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలందరూ వివిధ వ్యాపార భాగస్వామ్యం కోసం ముందుకు వచ్చి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళా సంరక్షణపై కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీనివాసరావు, అదనపు డిఆర్డిఓ సరస్వతి, మెప్మా పిడి హనుమంత్ రెడ్డి, సిడిపిఓ స్వరూప, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఈత చెట్ల వనాలకు నష్టపరిహారం అందించాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

**ముద్ర, కోరుట్ల :**



జగిత్యాల జిల్లాలో ఇటీవల అగ్నిప్రమాదాల కారణంగా భారీ సంఖ్యలో ఈత చెట్లు కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఎంపీ అర్వింద్ లేఖ రాసినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాల వల్ల ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీత కార్మికులు, రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సంవత్సరాల పాటు పెంచుకున్న ఈత చెట్లు కాలిపోవడం వల్ల కుటుంబాలు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు వెంటనే సర్వే నిర్వహించి, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ఎంపీ అర్వింద్ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా స్పందించి, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

- మున్సిపల్ సమావేశంలో పలు అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం

**ముద్ర, కోరుట్ల;**



కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన సోమవారం రోజు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగినది. సమావేశంలో పొందుపరచిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపినారు. పట్టణములోని అన్ని వార్డుల లో మురికి కాలువలు శుభ్రం చేయుటకు తగు చర్యలు తీసుకోవల్సిందిగా, నీటి ఎద్దడి గురించి వార్డు సభ్యులందరు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయడం జరుగుతుందని చైర్ పర్సన్ తెలియజేశారు. అలాగే రెవెన్యూ విభాగములో 202526 ఆర్థిక సంవత్సరపు 92% ఇంటి పన్ను వసూలు మరియు ప్రస్తుత సంవత్సరము 2026 27 గాను 5% రిబిట్ లో 41% రెండు కోట్ల 26 లక్షల రూపాయలు పన్ను వసూలు చేసిన బిల్ కలెక్టర్ అందరిని చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్, కమిషనర్ కౌన్సిల్ సభ్యులందరూ శాలువాలతో సన్మానించినారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ , మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ, మేనేజర్, జె ఏ ఓ, ఆర్ ఓ, మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు అమలు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్, జాతీయ రహదారులపై సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు, రేడియం లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### ఉమ్మడి కరీంనగర్ వార్తలు



## గంజాయి పట్టివేత

- ముగ్గురు అరెస్ట్
- వెల్లడించిన డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల రూరల్ మండలం చెల్గల్ గ్రామంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి 1675 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. జగిత్యాల రూరల్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా సోమవారం నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లూ తెలిపారు. వీరితో పాటు మరో నిందితుడు ఒడిశాకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.

## రాష్ట్రావతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ముద్ర ప్రతినిధి, నిర్మల్ :**

తెలంగాణా రాష్ట్రావతరణ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలన్నారు. జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com